## తీవ్రరూపం దాల్చనున్న
# ఈశాన్యం

రేపటి నుంచే కుండపోత

చెన్నై సహా 4 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

ఏర్పాట్లను పరిశీలించిన డిప్యూటీ సీఎం



రిప్పన్‌భవనంలో కంట్రోల్ రూం పనితీరు పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మేయర్ ఆర్.ప్రియ, అధికారులు

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చనున్నాయి. ఈ రుతుపవనాల ప్రభావంతో ఈ నెల 15న చెన్నై సహా నాలుగు జిల్లాల్లో కుండపోతగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించినట్లు వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు హెచ్చరించారు. మంగళవారం ఒకే రోజు 6 నుంచి 20 సెం.మీ.ల చొప్పున ఉరుములు మెరుపుల మధ్య కుండపోతగా వర్షాలు కురుస్తాయని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతపవన ప్రభావిత వర్షాల కారణంగా ఏర్పడనున్న వరద పరిస్థితులను ఎదుర్కొనేలా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రారంభించింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఆదివారం వరద ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా ఇప్పటికే కన్నియాకుమారి సహా దక్షిణాది జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం శివగంగ జిల్లా అంతటా కుండ పోతగా వర్షాలు కురిశాయి. రాయపేట, చేపాక్, మనలి, మాధవరం, పుళల్, అన్నాసాలై, ట్రిప్లికేన్ ప్రాంతాల్లోనూ వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ప్రస్తుతం అల్పపీడనం ఏర్పడి, దాని ప్రభావంతో సముద్రతీర ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ నెల 15 నుంచి మూడు రోజులపాటు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నారు. ఈ నాలుగు జిల్లాలకు ఇప్పటికే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు తెలిపారు. సోమవారం విల్లుపురం, కడలూరు, పుదుచ్చేరి ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నాగపట్టినం, తంజావూరు, తిరువారూరు, కాంచీపురం, చెన్నై, తిరువళ్లూరు, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, అరియలూరు, చెంగల్పట్టు, మైలాడుదురై, కారైక్కాల్ ప్రాంతాల్లోనూ కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. ఆరెంజ్ అలెర్ట్ కారణంగా విమాన సేవలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

### సహాయక చర్యలకు సర్వం సిద్ధం...

ఇదిలా ఉండగా భారత వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్ట్ చేయడంతో చెన్నై నగరంలో వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు, సహాయక చర్యలకు ప్రభుత్వం యంత్రాగం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు. రిప్పన్ భవనంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1913 నెంబర్‌తో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం పనితీరు కూడా పరిశీలించానని, ఆ కేంద్రంలో నాలుగు షిఫ్టుల్లో 150 మంది సిబ్బంది 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరిస్తారని తెలిపారు. నగరవాసులకు వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని 'నమ్మ చెన్నై' యాప్ ద్వారా తెలియజేస్తామన్నారు. అధికారులతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 13 వేల మంది స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు టీఎన్ అలెర్ట్ పేరుతో కొత్త యాప్ కూడా ఉందన్నారు. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రజలు వర్షాలకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని తెలిపారు.

## రంగనాథన్‌స్ట్రీట్‌లో
# వాచ్ టవర్లు



వాచ్‌టవర్‌పై నుంచి జనాల కదలికలను పరిశీలిస్తున్న కానిస్టేబుల్

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా ముగిసి దీపావళి పండుగ రానుండటంతో టీనగర్ రంగనాథన్ వీధిలో కొత్త దుస్తులు, టపాసులు కొనేందుకు నగరవాసులు ఆదివారమే తరలివచ్చారు. ఈ నెల 31న రాష్ట్ర వ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. ఇంకా మూడు వారాల గడువు మాత్రమే ఉండటంతో నగరవాసులు దుస్తుల కోసం ప్యారీస్ కార్నర్, పురుషవాక్కం, టీనగర్ ప్రాంతాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ వీధిలో నేరాలు జరుగకుండా ఉండేందుకు పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆ ప్రకారం ఆదివారం ఆ వీధిలో మూడు వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. ఆ టవర్లపైనుంచి పోలీసులు ఆ వీధిలో తిరిగే వారిని బైనాక్యులర్ల ద్వారా నిఘా వేస్తున్నారు. ఆయుధపూజ సెలవుల సందర్భంగా మూడు రోజులపాటు రంగనాథన్ వీధిలోని దుకాణాలన్నీ జనంతో నిండిపోయాయి. వచ్చే రెండు వారాలు ఈ వీధిలో జనసంచారం విపరీతంగా పెరుగుతుందని పోలీసు అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకించి రాబోయే రెండు ఆదివారాలూ ఈ వీధిలో జనాన్ని కట్టడి చేయడం తలకు మించిన భారమే అవుతుందని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో పాత జేబుదొంగల ఫొటోలు కలిగిన పోస్టర్లను అతికించారు. ఇదే విధంగా ప్యారీస్ కార్నర్, వాషర్‌మెన్‌పేట, పురుషవాక్కం తదితర ప్రాంతాల్లోనూ పోలీసులు దీపావళి సేల్స్‌కోసం వెళ్లే నగరవాసులకు గట్టి భద్రత కల్పిస్తున్నారు. ప్యారీస్ కార్నర్ జంక్షన్, వాషర్‌మెన్‌పేట ప్రాంతాల్లో వాచ్‌టవర్లు ఏర్పాటు చేయనున్నామని పోలీసు అధికారులు పేర్కొన్నారు.

## కులశేఖరపట్టినంలో
# అట్టహాసంగా శూరసంహారం

● భక్తుల పారవశ్యం

ప్యారీస్, అక్టోబరు 13: తూత్తుక్కుడి జిల్లా కులశేఖరపట్టినం దసరా ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. భక్తుల నామస్మరణ మధ్య ముత్తారమ్మన్ మహిషాసుర వధ కార్యక్రమం సముద్రతీరంలో నేత్ర పర్వంగా సాగింది. మైసూరు తర్వాత దసరా ఉత్సవాలకు ప్రసిద్ధిగాంచిన కులశేఖరపట్టినం సముద్ర తీరం శనివారం సాయంత్రం లక్షలాది మంది భక్తులతో కిటకిటలాడింది. ఈ ఆలయంలో ఈ నెల 3న ధ్వజారోహణంతో దసరా ఉత్సవాలు ప్రారంభంకాగా, మాలధారణ చేసిన భక్తులు పది రోజులు ఆలయ ప్రాంగణంలోనే ఉండి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారిని సేవించారు. పదో రోజైన శనివారం ఉదయం 10.30 గంటలకు గర్భగుడిలో కొలువుదీరిన అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ప్రత్యేక అలంకారంలో అమ్మవారిని కొలువుదీర్చారు.



సముద్రతీరంలో మహిషాసుర వధకు శూలాయుధంతో బయల్దేరిన అమ్మవారు



అర్ధరాత్రి 12 గంటలకు మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారిని సింహ వాహనంపై ఆశీనులు చేసి సముద్రతీరంలో ఉన్న చిదంబరేశ్వరాలయానికి అశేష భక్తజనం మధ్య ఊరేగింపుగా తరలించారు. అర్ధరాత్రి సమయంలో భక్తులు దివ్య నామ స్మరణ మధ్య అమ్మవారు మహిషాసుర వధ చేసారు. అర్ధరాత్రి 12.20 గంటలకు గేదె తల, 12.28కి కోడిపుంజు తలను వధించి అమ్మవారికి నైవైద్యం చేశారు. ఆదివారం తెల్లవారుజామున 1.30ల ప్రాంతంలో సముద్రతీరంలో ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారికి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత అమ్మవారిని రథంలో పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం 5 గంటల వరకు సాగిన ఈ ఊరేగింపులో కళాకారులు వివిధ రకాలైన నృత్యాలు, కోలాటాలతో ఆలరించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి క్షీరాభిషేకం, పుష్పాలంకరణ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తిరునెల్వేలి, తూత్తుకుడి, తిరుచ్చెందూరు, తెన్‌కాశి, నాగర్‌కోయిల్ తదితర ప్రాంతాల నుంచి రవాణా శాఖ వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడిపింది. శూరసంహారం వేడుకలకు సుమారు 4 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారి రూపాల్లో కళాకారుల ప్రదర్శన

# టీవీకే మహానాడుకు భారీ ఏర్పాట్లు

● పోలీసుల కొత్త నిబంధనలు

ప్యారీస్, అక్టోబరు 13: విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.సాలైలో ఈ నెల 27న నిర్వహించనున్న తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడుకు పార్టీ అధిష్ఠానం భారీ ఏర్పాట్లు చేపట్టింది. వేదిక ప్రాంగణంలో పార్టీ జెండాను పార్టీ వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీనటుడు విజయ్ ఎగురవేసి మహానాడు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం వందడుగల పతాక స్తంభానికి శనివారం నిర్వహించిన భూమి పూజల్లో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, పలు కమిటీల నిర్వాహకులు పాల్గొన్నారు. మహానాడు ప్రవేశద్వారంలో సెయింట్ జార్జి కోట నమూనాలో భారీ సెట్టింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహానాడు ముగిశాక కొన్ని సంవత్సరాలపాటు పార్టీ జెండా ఎగిరేలా వి.శాలైకు చెందిన మణి అనే రైతు స్థలాన్ని ఐదేళ్లకు టీవీకే లీజుకు తీసుకుంది. ఈ నేపథ్యంలో, మహానాడులో పాల్గొనేందుకు వెళ్లే కార్యకర్తలు భోజనం, తాగునీరు కొరత లేకుండా సరఫరా చేసేందుకు, అలాగే మరుగుదొడ్ల పనులను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. మహానాడు నిర్వహించేందుకు విల్లుపురం జిల్లా పోలీసులు 37 నిబంధనలు విధించింది. మహానాడులో సుమారు 5 లక్షల మంది కార్యకర్తలు వచ్చే అవకాశముండడంతో, అదనంగా మరో 70 ఎకరాల స్థలం ఏర్పాటుచేయాలని ఆదేశించింది.

### పర్యవేక్షణకు 27 కమిటీలు

పెరంబూర్, అక్టోబరు 13: తమిళగ వెట్రి కళగం మహానాడు ఏర్పాట్ల పర్యవేక్షణకు 27 ప్రత్యేక కమిటీలను ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. టీవీకే తొలి మహానాడు ఈ నెల 27వ తేది జరుగనుంది. ఈ మహానాడు నిర్మాణాలకు ఇటీవల భూమి పూజ కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులను మహానాడుకు భారీగా తరలించాలని అధిష్ఠానం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, మహానాడు ఏర్పాట్లు పర్యవేక్షణకు 27 ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఒక్కో కమిటీకి అధ్యక్షుడు, నిర్వాహకులను ప్రకటించారు. అలాగే, ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా 104 మందితో కమిటీ కూడా ఏర్పాటైంది.



ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్నరైలు బోగీలు

# రైలు ప్రమాదంపై విచారణ

13 మందికి సమన్లు

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపం కవరపేట రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన భాగమతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదంపై దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ ఎన్.సింగ్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి కమిటీ విచారణ ప్రారంభించింది. స్టేషన్ మాస్టర్ సహా 13 మంది రైల్వే సిబ్బందికి సమన్లు కూడా పంపించారు. భాగమతి ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉన్న గూడ్సు రైలును వెనుకవైపు ఢీకొనటంతో 12 బోగీలు చెల్లాచెదురుగా పడ్డాయి. రెండు బోగీలకు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. 19 మంది తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. రైలు పొన్నేరి రైల్వేస్టేషన్ దాటి కవరపేట రైల్వేస్టేషన్ సమీపిస్తుండగా మెయిన్ లైన్‌లో పడాల్సిన గ్రీన్ సిగ్నల్ లూప్‌లైన్‌లో పడింది. దీంతో ఆ ఎక్స్‌ప్రెస్ కుదుపులతో లూప్‌లైన్‌లో ఉన్న గూడ్సురైలును ఢీకొనడంతో బోగీలు పట్టాలు తప్పాయి. ప్రమాదం జరిగిన చోట ఇనుప బోల్టులు పడి ఉండటంతో ఆ రైలును కూల్చివేసేందుకు ఎవరైనా కుట్ర పన్ని ఉంటారనే అనుమానంపై కూడా జాతీయ భద్రతా విభాగం (ఎన్ఐఏ) దర్యాప్తు జరుపుతోంది. లూప్‌లైన్ మీదుగా ఎక్స్‌ప్రెస్ వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ పడటానికి కారకులెవరనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ లోకో పైలట్, కో పైలట్‌లను కూడా విచారణ జరుపుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి కవరపేట రైల్వేస్టేషన్ మాస్టర్, కంట్రోలు రూమ్ సాంకేతిక సిబ్బంది సహా మొత్తం 13 మందికి సమన్లు జారీ చేశారు. వీరిని ఈ నెల 16, 17 తేదీల్లో రైల్వే జోనల్ కార్యాలయంలో రైల్వే భద్రతా విభాగం ఉన్నతాధికారి విచారణ జరుపనున్నారు. పొన్నేరి రైల్వేస్టేషన్ వద్ద ఇప్పటికే రెండు సార్లు రైళ్లను కూల్చివేసేందుకు కుట్రలు జరిగాయనే అనుమానాలు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 2న సిగ్నల్ బాక్స్‌లోని నట్లు, బోల్టులను ఎవరో తొలగించి ఉంచడం రైల్వే సిబ్బంది కనుగొన్నారు. దానికి 10 రోజుల ముందు పట్టాలను కలిపే కమ్మీలను ఎవరో వంచడాన్ని కూడా సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన రైలు ప్రమాదంపై ఓ వైపు ఎన్ఐఏ, మరో వైపు రైల్వే భద్రతా విభాగం అధికారులు విచారణ జరుపుతున్నారు. మొత్తం సంఘటనపై కొరుక్కుపేట రైల్వే పోలీసులు కూడా దర్యాప్తు ముమ్మరం చేశారు.

# మదురైలో కుండపోత

రెండు గంటల్లో 16 సెం.మీ.ల వర్షం



వాననీటిలో చిక్కుకున్న వాహనాలు

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మదురైలో శనివారం రాత్రి కుండపోతగా కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. రెండుగంటల వ్యవధిలో సుమారు 16 సెం.మీల. వర్షపాతం నమోదైంది. మదురై తముకం మైదానం, అన్నానగర్, కేకే నగర్ తదితర ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షానికి మాట్టుతావని సమీపం టీఎం.నగర్ పరిసర ప్రాంతాలను ఆనుకుని ప్రవహించే సాత్తైయార్ వాగు కట్టలు తెగిపోయింది. దీంతో ఆకస్మికంగా వరద పరిస్థితులు నెలకొన్నాయి. ఆ వాగు నుంచి ఉధృతంగా ప్రవహించిన జలాలు నగరంలోని జనావాస ప్రాంతాలను ముంచెత్తాయి. ఇదే విధంగా మదురై సెంట్రల్ కోఆపరేటివ్ సెంటర్ రోడ్డు, కారు పార్కింగ్ అంతటా వర్షపునీరు చొరబడింది.

# యువతే దేశాభివృద్ధికి కీలకం

● గవర్నర్ ఆర్.ఎన్.రవి
● ఘనంగా తిరువళ్లువర్ వర్సిటీ 19వ స్నాతకోత్సవం



విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

వేలూరు, అక్టోబరు 13: దేశాభివృద్ధికి యువతే ప్రధాన కారకులను రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్.రవి అన్నారు. స్థానిక సేర్కాడులోని తిరువళ్లువర్ యూనివర్శిటీ 19వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. వర్సిటీ రిజిస్ట్రార్ సెంథిల్ వేల్‌మురుగన్ ఆహ్వానం పలుకగా, వైస్ ఛాన్సలర్ ఆర్ముగం అధ్యక్షత వహించారు. యూనివర్శిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ముఖ్యఅతిథిగా హాజరై 13 విభాగాలకు చెందిన 155 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ... ప్రస్తుతం భూమి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, తద్వారా ఏర్పడే నష్టాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం మైక్రో ప్లాస్టిక్ వేస్టేజీ అధికమవుతోందని, మైక్రో ప్లాస్టిక్ వ్యర్థాలతో రహదారులు వేస్తున్నారని తెలిపారు. పలురకాల పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయనాలు చెరువుల్లోను, వ్యర్థాలు రోడ్ల పక్కన వేస్తున్నారన్నారు. దీంతో, పర్యావరణానికి హాని కలుగుతోందని, ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాలంటే నానో టెక్నాలజీ వినియోగించాలని సూచించారు. యువకులు అధికసంఖ్యలో డిజిటల్ టెక్నాలజీ వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి చెరియన్, ఉద్యానవన శాఖ డైరెక్టర్ గాంధీ సహా పలువురు పాల్గొన్నారు.

## సమాచార దర్శిని

### కొత్త కళాశాలలు, కోర్సుల ప్రారంభానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 13: మద్రాసు విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలు, వచ్చే ఏడాది కొత్త కోర్సులు ప్రారంభించేందుకు నవంబరు 4వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఈ విషయమై వర్సిటీ రిజిస్ట్రార్ ఏలుమలై విడుదల చేసిన ప్రకటనలో... వర్సిటీ పరిధిలో కొత్త ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ప్రారంభించడం, కొత్తగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు, ఇంటిగ్రేటెడ్ కోర్సులు ప్రారంభించేందుకు ఆసక్తి ఉన్నవారు నవంబరు 4వ తేదిలోపు www.unom.ac.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అందు కోసం రూ.2,360 ఫీజు, 18 శాతం జీఎస్టీ కలిపి చెల్లించాలని రిజిస్ట్రార్ తెలియజేశారు.

### నేడు పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదల

పెరంబూర్, అక్టోబరు 13: ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ సోమవారం విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అన్బిల్ మహేష్ తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో, ఈ నెల 14న ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన 10, ప్లస్ వన్, ప్లస్ టూ షెడ్యూల్ విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

### గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

ఐసిఎఫ్, అక్టోబరు 13: ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో ప్రతినెలా పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. ఆ ప్రకారం, ఈ నెల గిరి ప్రదిక్షిణ సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ఆ ప్రకారం, ఈ నెల 16వ తేది బుధవారం రాత్రి 8 గంటలకు ప్రారంభమై మరుసటిరోజు 17వ తేది సాయంత్రం 5.38 గంటల వరకు గిరి ప్రదక్షిణకు అనుకూల సమయమని నిర్వాహకులు తెలిపారు.

### 17 నుంచి సిద్ధ వైద్యకోర్సుల కౌన్సెలింగ్

పెరంబూర్, అక్టోబరు 13: సిద్ధ, యునాని, హమియోపతి, ఆయుర్వేద వైద్య కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి తొలివిడత కౌన్సెలింగ్ ఈ నెల 17వ తేది నుంచి జరుగనుంది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో సిద్ధ, యునానీ, హోమియోపతి, ఆయుర్వేద వైద్య కోర్సుల్లో 2,310 సీట్లున్నాయి. 6,190 మంది దరఖాస్తు చేసిన నేపథ్యంలో, రెండు రోజుల క్రితం విడుదల చేసిన ర్యాంకు జాబితాలో 5,638 మంది అర్హత సాధించారు. 'నీట్' ఆధారంగా జరుగనున్న కౌన్సెలింగ్‌లో ఈ నెల 17 తొలిరోజు ప్రత్యేక విభాగం, 7.5 శాతం ప్రభుత్వ పాఠశాలల కోటా సీట్లకు కౌన్సెలింగ్ జరుగనుంది. అనంతరం 18 నుంచి 26వ తేది వరకు జనరల్ విభాగం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అరుంబాక్కంలోని సిద్ధ ఆసుపత్రి ప్రాంగణంలో కౌన్సెలింగ్ జరుగుతుందని, మరిన్ని వివరాలకు https://tnhealth.tn.go-v.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని జాతీయ వైద్యం, హోమియోపతి శాఖ తెలియజేసింది.

### ఆరోగ్య కేంద్రాల్లో 'మే ఐ హెల్ప్ యూ' బోర్డులు

పెరంబూర్, అక్టోబరు 13: రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'మే ఐ హెల్ప్ యూ (నాన్ ఉంగళుక్కు ఉదవలామా)' బోర్డులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలో అర్బన్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మొత్తం 14,527 కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో జ్వరం, బీపీ, షుగర్ సహా ప్రాథమిక చికిత్సతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే రోగులకు సూచనలు, దిశానిర్దేశం చేసేలా ప్రవేశ ద్వారాల వద్ద 'మే ఐ హెల్ప్ యూ' అనే బోర్డులు ఏర్పాటుచేయాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

### 1వ తేదిని సెలవుగా ప్రకటించాలి

పెరంబూర్, అక్టోబరు 13: దీపావళి పండుగ సందర్భంగా నవంబరు 1 తేదీని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అమృతకుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది దీపావళి పండుగను ఈ నెల 31వ తేది (గురువారం) ప్రజలు జరుపుకోనున్నారు. మరుసటిరోజు శుక్రవారం (నవంబరు 1వ తేది) పని దినం కాగా, 2,3 తేదీలు శని, ఆదివారాలు ప్రభుత్వ సెలవు. ఈ నేపథ్యంలో, నవంబరు 1వ తేది ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తే, సొంతూళ్లకు వెళ్లే ప్రజలు నాలుగు రోజులు కలిసొస్తుందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది.

### 'సెల్వమగళ్' పథకంలో రాష్ట్రం అగ్రస్థానం

పెరంబూర్, అక్టోబరు 13: ఆడపిల్లల కోసం 'సెల్వమగళ్' పొదుపు పథక అమలులో దేశంలో తమిళనాడు రీజియన్ వరుసగా 8వ ఏడాది కూడా అగ్రస్థానంలో నిలిచింది. విద్యార్థులకు పొదుపుపై ఆసక్తి పెంచేలా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌తో కలసి రాష్ట్రవ్యాప్తంగా 51.5 లక్షల పిల్లలకు పొదుపు ఖాతాలు ప్రారంభించారు.

### రూ.135 కోట్లతో ఎన్నూర్ ముఖద్వారం పునరుద్ధరణ

పెరంబూర్, అక్టోబరు 13: ఉత్తర చెన్నైలో వరద ముంపును అడ్డుకొనేలా రూ.135 కోట్లతో ఎన్నూర్ ముఖద్వారం లోతు పెంచడం, ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయిందని ప్రజా పనుల శాఖ అధికారులు తెలిపారు. నగర తాగునీటి అవసరాలు తీర్చే పూండి సత్యమూర్తి, పుళల్ జలాశయాలు నిండిన సమయంలో అదనపు జలాలు కుశస్థలి నదిలో కలిసి ఎన్నూర్ ముఖద్వారం వద్ద సముద్రంలో కలుస్తుంటాయి. కానీ ఎన్నూర్ ముఖద్వారం లోతు తక్కువగా ఉండడం, అలలకు ఇసుక మేటలు ఏర్పడడంతో నీరు సక్రమంగా సముద్రంలోకి కలవక, ఉత్తర చెన్నైలోని పలు ప్రాంతాలు వరద ముంపునకు గురవుతున్నాయి. దీనిని నివారించేందుకు చేపట్టిన ఎన్నూర్ ముఖద్వారం పునరుద్ధరణ పనులు ముగిశాయని, వరద నీరు ఎలాంటి అడ్డులేకుండా సముద్రంలోకి వెళతాయని అధికారులు తెలిపారు.

### ముట్టుకాడులో కలైంజర్ ఆడిటోరియం

పెరంబూర్, అక్టోబరు 13: స్థానిక ఈసీఆర్ రోడ్డు సమీపం ముట్టుకాడులో అంతర్జాతీయ స్థాయిలో కలైంజర్ ఆడిటోరియం ఏర్పాటుకానుంది. ఆ ఆడిటోరియం నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండర్ ప్రక్రియ. సంస్థ ఎంపిక చేసి 2025 చివరలో, 2026 ప్రారంభంలో ఈ ఆడిటోరియం ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ముట్టుకాడులో రూ.487 కోట్లతో ఆడిటోరియం నిర్మించనున్నారు.

# అక్షయ సాయిబాబా ఆలయంలో విశేష పూజలు


అక్షయబాబా సేవలో నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 13: స్థానిక బ్రాడ్‌వే ఆచారప్పన్ వీధిలోని జై వాసవి సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయిబాబా సమాధి రోజును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గణపతి హోమం, దుర్గాలక్ష్మి, సరస్వతి హోమం, సమస్త దేవతా హోమం, సాయినాథ హోమం, విశేష అభిషేకం, అలంకారం, హారతి, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు-విజయలక్ష్మి, ఫైనాన్షియల్ ట్రస్టీ డాఎంవీ నారాయణ గుప్తా-జ్యోతి, తిరుమల ట్రేడర్స్ అధినేత పి.పుష్పరాజ్-కృష్ణవేణి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 13: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా సోమ, మంగళవారాల్లో దిగువ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**సోమవారం....**

గుమ్మిడిపూండి: గుమ్మిడిపూండి బజార్ (జీఎన్‌టీ రోడ్డు) నుంచి పేదికుప్పం రైల్వే బ్రిడ్జి వరకు, వేర్కాడు, రెట్టంబేడు మెయిన్ రోడ్డు, ఆతుపాక్కం, ఎనతిమేల్‌పాక్కం, బాలకృష్ణాపురం, మాపోసీ నగర్, సోలియంబాక్కం, తేర్వాళి, తంబురెడ్డి పాళయం, అప్పావరం, మంగావరం, కురివియాగం గ్రామాలు

**మంగళవారం...**

నొలంబూర్: చిన నొలంబూర్, పెద్ద నొలంబూర్, గురుస్వామి రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ ఫేస్ -1,2, యూనియన్ రోడ్డు, వీజీఎన్ నగర్ 1 నుంచి 6,8 బ్లాక్‌లు, రాజీవ్ గాంధీ వీధి, పంజోలై వీధి, సర్వీస్ రోడ్డు, ఎస్ఆర్ఆర్ నగర్, ఎస్ఎస్‌వీ గార్డన్, జశ్వంత్ నగర్, మీనాక్షి అవెన్యూ, ఎంసీకే లేఔట్, ఎంజీఆర్ యూనివర్సిటీ

**రాధాకృష్ణన్ నగర్:** వీఓసీ నగర్, ఆర్కే నగర్, తిలగర్ నగర్, ఎల్లయ్యముదాలి వీధి, సేనిఅమ్మన్ ఆలయ వీధి, టీహెచ్ రోడ్డు కొంత భాగం, టోల్ గేట్, స్టాన్లీ ప్రాంతం, పాత వాషర్‌మెన్‌పేట, కన్నికోయిల్, కల్యాణ మండపం ఏరియా, గుమ్మాలమ్మన్ ఆలయ వీధి, జీఏ రోడ్డు, తాండరాయ గ్రామణి వీధి, సోలయప్పన్ వీధి, శ్రీ రంగమ్మాళ్ వీధి, సంజీవరాయన్ ఆలయ వీధి, కప్పాల్ బోలు వీధి, బాలు ముదాలి వీధి, జేవీ ఆలయ వీధి, రామానుజ అప్పర్ వీధి, బాల అరుణాచల వీధి, లాయర్ చిన్నతంబి వీధి 1,2 వీధులు, నమశ్శివాయ చెట్టి వీధి, జస్టిస్ పాండాలై కాలని వీధి, వెంకటాచలం రోడ్డు, తాండవరాయన్ ముదాలి వీధి, టీహెచ్ రోడ్డు ఎస్ఎస్ ప్రాంతం

## గిరి ప్రదక్షిణ మార్గంలో స్వాముల బ్యాగుల తనిఖీ



ఐసిఎఫ్, అక్టోబరు 13: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయం చుట్టూ 14 కి.మీ గిరి ప్రదక్షిణ మార్గం ఉంది. ఈ మార్గంలో అనేకమంది స్వాములు నివాసం ఉంటున్నారు. వీరిలో కొందరు గంజాయి సహ ఇతర మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో, తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో స్వాముల బ్యాగులను పోలీసులు తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో ఎన్ని రోజులుగా ఉంటున్నారు, స్వాములకు కల్తీ సారా, గంజాయి అలవాటు ఉందా అంటూ వారిని ప్రశ్నించారు.

## కుంభకరై జలపాతంలో స్నానాలకు నిషేధం

పెరంబూర్, అక్టోబరు 13: తేని జిల్లా పెరియకుళం సమీపం పశ్చిమ కనుమల ప్రాంతాల్లో కుంభకరై జలపాతం ఉంది. ఈ ప్రాంతానికి ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి పర్యాటకులు వచ్చి జలపాతం వద్ద స్నానాలు చేయడంతో పాటు పర్యాటక ప్రాంతాలు సందర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా పశ్చిమ కనుమల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా కుంభకరై జలపాతంలో వరద ప్రవాహం అధికంగా ఉంది. దీంతో, జలపాతం వద్ద పర్యాటకుల స్నానాలకు నిషేధం విధించడంతో పాటు పోలీసులు, అటవీ సిబ్బంది అక్కడ భద్రతా చర్యలు చేపట్టారు.

## తులిర్ పాఠశాలలో విజయదశమి అడ్మిషన్లు


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

వేలూరు, అక్టోబరు 13: స్థానిక గాంధీనగర్‌లోని తులిర్ పాఠశాలలో విజయదశమి సందర్భంగా అడ్మిషన్లు చేపట్టారు. కార్యక్రమానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జనార్థనన్ అధ్యక్షత వహించగా, ట్రస్టీ పళని ఆహ్వానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో కాట్పాడి డివిజన్ రెడ్‌క్రాస్ సంఘం సెక్రటరీ ఎస్.శివవడివు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలచేత అక్షరాలు రాయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిత్ర, ధనలక్ష్మి, భారతి, మలర్‌కొడి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతానికి విద్యార్థి మృతి


మృతుడు దీపక్‌కుమార్

పెరంబూర్, అక్టోబరు 13: ఇస్త్రీ చేస్తున్న విద్యార్థి హఠాత్తుగా విద్యుదాఘాతానికి గురై మరణించాడు. తిరువళ్లూర్ సమీపం విడయూరులోని తమ ఇంట్లో 9వ తరగతి విద్యార్థి దీపక్‌కుమార్ ఇస్త్రీ చేస్తున్నాడు. ఐరన్ బాక్స్‌కు ఉన్న విద్యుత్ వైరు బయటకు వేలాడడం గమనించని దీపక్‌కుమార్, దానిని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

**ట్రాక్ పక్క స్తంభం ఢీకొని గాయాలు...**

స్థానిక మాధవరం ప్రాంతానికి చెందిన అభిలాష్ సెయింట్ థామస్ మౌంట్‌లోని కళాశాలలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేస్తున్నాడు. సంఘటన జరిగిన రోజున సబర్బన్ రైలులో స్నేహితులతో కలసి బయల్దేరాడు. ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్న అభిలాష్, కమ్ములు పట్టుకొని వేలాడుతూ సాహసం చేస్తున్న సమయంలో రైలు మార్గం పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని వెంటనే స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా అభిలాష్ సాహసం చేస్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

## ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలో భారీ అవినీతి

**● ఈపీఎస్ ఖండన**

ప్యారీస్, అక్టోబరు 13: ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలో భారీ అవినీతి జరుగుతున్నా డీఎంకే ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. ఆయన ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ వర్గాలకు అనేక పథకాలు విజయవంతంగా అమలు పరిచినట్లు తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఈ అణగారిన వర్గాల ప్రజల జీవన శైలి మెరుగుపరిచేందుకు అమలుపరిచిన పథకాల జాబితాను ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం అటకెక్కించిందని ఆరోపించారు. 41 నెలల స్టాలిన్ పాలనలో తమిళనాడు ఆదిద్రావిడ గృహాభివృద్ధి సంస్థలో ఖాళీ పోస్టులు ఇప్పటివరకు భర్తీచేయలేదని తెలిపారు. అదే విధంగా, 1,138 విద్యాసంస్థల్లో సుమారు 1,300 టీచర్ల నియామకం జరుగలేదని, అందువల్ల విద్యార్థులు సకాలంలో సిలబస్‌ను పూర్తిచేయలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ శాఖకు అందే నిధులను పూర్తిగా ఖర్చుపెట్టకుండా తిరిగి పంపిస్తున్నారని ఈపీఎస్ వ్యాఖ్యానించారు.

## రూ.72 లక్షల బంగారం స్మగ్లింగ్

**● ప్రయాణికుడి అరెస్టు**

అడయార్, అక్టోబరు 13: మలేసియా నుంచి చెన్నై వచ్చిన విమానంలో రూ.72 లక్షల విలువైన బంగారాన్ని అక్రమంగా తీసుకొచ్చిన ఒక ప్రయాణికుడిని ఎయిర్‌పోర్టు అధికారులు అరెస్టు చేశారు. అతడి నుంచి 24 క్యారెట్ల బంగారు నాణేలను కూడా స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి మలేసియా నుంచి చెన్నై ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికులు లగేజీలను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో నగరానికి చెందిన ఓ ప్రయాణికుడు మలేసియా పర్యటనకు వెళ్లి నగరానికి తిరిగివచ్చాడు. అతడి లగేజీలో రూ.72 లక్షల విలువైన బంగారు నాణేలను స్వాధీనం చేసుకున్నారు.

## టేకాఫ్‌కు ముందే ఎందుకు తనిఖీ చేయలేదు?

**● తిరుచ్చి ఘటనపై పోలీసులు విచారణ**

అడయార్, అక్టోబరు 13: తిరుచ్చి నుంచి షార్జాకు బయలుదేరిన ఎయిరిండియా విమానంలో చక్రాలకు సంబంధించిన హైడ్రాలిక్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపంపై విమానాశ్రయ అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ విమానం బయలుదేరేందుకు ముందు హైడ్రాలిక్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందా? లేదా? అనే అంశంపై తనిఖీ చేశారా? లేదా అనే అంశంపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సారథ్యంలోని ఉన్నతాధికారుల బృందం ఆరా తీస్తుంది. ఈ విచారణ తర్వాతే ఈ సమస్యకు అసలు కారణం వెలుగులోకిరానుంది. శుక్రవారం రాత్రి తిరుచ్చి నుంచి షార్జాకు 141 మంది ప్రయాణికులతో బయలుదేరిన వెళ్ళిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో హైడ్రాలిక్ సిస్టం పనిచేకపోవడాన్ని పైలెట్లు గుర్తించి వెనక్కి మళ్లించారు. విమానాన్ని గగనతలంలో చక్కర్లు కొట్టించి, ఆ తర్వాత సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఈ విమానం లాండింగ్ అయ్యేంత వరకు ఉత్కంఠ నెలకొన్న విషయం తెల్సిందే. పైలెట్లు సమయస్ఫూర్తిగా వ్యవహరించి విమానానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేయడంతో పాటు 141 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు.

## నేడు ఇండియా కూటమి నేతల సమావేశం

ప్యారీస్, అక్టోబరు 13: ఆర్ఎస్ఎస్, బీజేపీ వైఖరిని ఖండిస్తూ సోమవారం తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ఆధ్వర్యంలో తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో ఇండియా కూటమి నేతల సమావేశం జరుగనుంది. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై నేతృత్వంలో జరిగే ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి ఎంఎన్ హెగ్డే, ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్, మాజీ ఎంపీలు కేవీ తంగబాలు, ఎన్.కృష్ణస్వామి, కేఎస్.అళగిరి, పీటర్ ఆల్ఫోన్స్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్ తదితరులు పాల్గొంటున్నారు.

## స్టాలిన్‌కు మహారాష్ట్ర గవర్నర్ పరామర్శ


మురసోలి సెల్వం వద్ద చిత్రపటం వద్ద సీఎం స్టాలిన్‌తో కలిసి నివాళులర్పిస్తున్న సీపీ రాధాకృష్ణన్

ప్యారీస్, అక్టోబరు 13: అనారోగ్యంతో ఇటీవల మరణించిన సీఎం స్టాలిన్ సోదరి సెల్వి భర్త మురసోలి సెల్వం చిత్రపటానికి ఆదివారం మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ నివాళులర్పించి స్టాలిన్ కుటుంబాన్ని ఓదార్చారు. గోపాలపురంలోని సెల్వి నివాసానికి వచ్చిన రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్‌తో కలిసి లోనికి వెళ్లి కుటుంబసభ్యులతో కలిసి నివాళులర్పించారు. బీజేపీ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి ఉన్నారు.

# మళ్లీ కరోనా వ్యాప్తి..!

**12 రోజుల్లో 17 మందికి లక్షణాలు**

పెరంబూర్, అక్టోబరు 13: రాష్ట్రంలో మళ్లీ కరోనా వ్యాప్తి చెందుతోంది. ఒకే రోజు నలుగురు సహా 12 రోజుల్లో 17 మందికి కరోనా లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. రాష్ట్రంలో 2011లో కరోనా వ్యాప్తి ప్రారంభం కాగా, మరుసటి ఏడాది తీవ్రరూపం దాల్చింది. గత ఏడాది నుంచి కరోనా వ్యాప్తి నియంత్రణలోకి రాగా, మార్పు చెందిన కరోనా వైరస్ మాత్రం అక్కడక్కడా కనిపిస్తోంది. కొవిడ్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు 36 లక్షల మంది కరోనా సోకగా, వారిలో 38,086 మంది మృత్యువాతపడ్డారు. ఈ క్రమంలో, ఈ నెల ప్రారంభం నుంచి మళ్లీ కరోనా వ్యాప్తి ప్రారంభమైంది. రాష్ట్రంలో చెన్నై, కోయంబత్తూర్, కన్నియాకుమారి, మదురై, చెంగల్పట్టు జిల్లాల్లో కరోనా కేసులు బయటపడ్డాయి. గత శుక్రవారం, 67 మందికి పరీక్ష చేయగా, చెన్నై, సేలం, తిరునల్వేలి, తిరుప్పూర్ జిల్లాల్లో తలా ఒకరు చొప్పున నలుగురికి కరోనా లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. ఈ నెలలో 12 రోజుల్లో 17 మందికి కరోనా లక్షణాలు నిర్ధారణ కాగా, వారిలో 12 మంది చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... కరోనా వ్యాప్తి చెందినా, మరణాల సంఖ్య తగ్గుతుండడంతో ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. అదే సమయంలో ప్రాథమిక స్థాయిలోనే లక్షణాలు గుర్తించి చికిత్స పొందాల్సి ఉంటుందన్నారు. ఇంటి వైద్యం, మందుల దుకాణాల్లో మాత్రలు కొనుగోలు చేసి వేసుకోవడం తదితరాలు చేపట్టి, చివరి క్షణంలో ఆస్పత్రికి వస్తే కాపాడడం కష్టమని తెలిపారు. అదే సమయంలో మాస్క్ ధరించడం, శానిటైజర్ వినియోగం తదితర ముందస్తు జాగ్రతలు చేపడితే మంచిదని అధికారులు తెలిపారు.

## మర్యాదపూర్వకం


ఆదివారం కల్లి ఉలగమ్ శివానంద ట్రస్ట్ అధ్యక్షుడు శివానందంను కలుసుకున్న వేలూరు కాట్పాడి కిలిత్తాన్‌పట్టరైలో తమిళ మానిల కాంగ్రెస్ దక్షిణ మండల యువజన విభాగం అధ్యక్షుడు గోపాలకృష్ణన్

## నాణ్యతలేని ఆహార పదార్థాలపై ఫిర్యాదు

పెరంబూర్, అక్టోబరు 13: నాణ్యతలేని ఆహార పదార్థాలపై వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆహార భద్రతా శాఖ కమిషనర్ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... హోటళ్లు, రోడ్డు పక్కన దుకాణాలు, లాడ్జిలు తదితర ప్రాంతాల్లో అందిస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత లేకపోవడంతో వినియోగదారులు హోటళ్ల సిబ్బందితో వాగ్వివాదానికి దిగుతున్నారని, కానీ ఆహార భద్రత శాఖకు ఫిర్యాదు చేయడం లేదన్నారు. ఫిర్యాదు చేయడంపై సరైన అవగాహన లేకపోవడమే కారణమన్నారు. అలాంటి నాణ్యతలేని ఆహార పదార్థాలపై 9444042322 అనే వాట్సాప్ నెంబర్లకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని కమిషనర్ సతీష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## చదువుల తల్లి క్షేత్రంలో అక్షరాభ్యాసం



ప్యారీస్, అక్టోబరు 13: విజయదశమి సందర్భంగా తమ పిల్లలకు తల్లిదండ్రులు శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం చేయించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో విద్యారంభ పూజలు శనివారం కోలాహలంగా నిర్వహించారు. తిరువళ్లూర్ జిల్లా పెరియపాళ్యం సమీపంలోని ఆర్యపాక్కంలో రాష్ట్రంలో రెండవదిగా పేరుగాంచిన విద్యారంభ జ్ఞాన మహాసరస్వతి ఆలయంలో అర్చకులు పిల్లలచే వారి తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్త వీవీ కృష్ణారావు-మణిమాలారావు దంపతులు, గురుస్వామి భక్తవత్సలంలు పిల్లలకు విద్యా సామగ్రి, నూతన వస్త్రాలు, భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, అక్టోబరు 13: ఉపాధి, వృత్తుల మార్గదర్శ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువత ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ఎల్‌సీ ఫెయిల్, పాస్ అయిన వారు హెచ్ఎస్సీ, డిప్లొమో, గ్రాడ్యుయేషన్ తదితరాలు పూర్తిచేసి, ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాల్లో పేరు నమోదుచేసుకొని ఐదేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న వారు ఉపకారవేతనానికి అర్హులు. అభ్యర్థులు 40 ఏళ్లు పైబడిన వారుగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు 45 ఏళ్ల వరకు మినహాయింపు ఉంటుంది. కుటుంబ వార్షికాదాయం రూ.72,000 ఉండాలి. ఆసక్తి కలిగిన వారు స్థానిక గిండిలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## మెరీనా ఘటన తొక్కిపెట్టేందుకే రైలు ప్రమాదంపై డీఎంకే రాద్ధాంతం

**● కేంద్ర మంత్రి ఎల్.మురుగన్**

అడయార్, అక్టోబరు 13: మెరీనా తీరంలో జరిగిన ఎయిర్ షో సందర్భంగా ఐదుగురు చనిపోవడం వంటి ఘటలను ప్రజలు మరిచిపోయేలా చేసేందుకు కవరైపేట వద్ద జరిగిన రైలు ప్రమాదంపై డీఎంకే రాద్ధాంతం చేస్తుందని కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ఆరోపించారు. మదురైలో జరిగిన బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు ఈ సభ్యత్వ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎయిర్ షో సందర్భంగా ఐదుగురు చనిపోయిన ఘటనను ప్రజలు మరిచిపోయేలా చేసేందుకు రైలు ప్రమాద ఘటనపై డీఎంకే కూటమి నేతలంతా కలిసికట్టుగా పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

## నేత్రపర్వంగా శ్రీవారికి పూలంగి సేవ



ప్యారీస్, అక్టోబరు 13: స్థానిక మాధవరం సమీపంలోని పొన్నియమ్మన్ మేడు మోహన్ నగర్‌లో ఉన్న వెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీవారికి వైభవంగా పూలంగి సేవ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు, సీతారామ లక్ష్మణులు, రామానుజలను పలు రకాల పూలతో అలంకరించారు. వేడుకల్లో భాగంగా భక్త బృందం అన్నమయ్య కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. సమాజం తరఫున కె.పద్మరాజ్, కె.ఐశ్వర్య భక్తులందరికీ అన్న తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో నాలుగు బంగారు పతకాలు


బంగారు పతకాలు సాధించిన జయమూర్తి

వేలూరు, అక్టోబరు 13: దక్షిణాఫ్రికా సన్‌సిటీ నగర్‌లో జరిగిన కామన్‌వెల్త్ వెయిట్ లిఫ్టింగ్‌లో గుడియాత్తం క్రీడాకారుడు నాలుగు బంగారు పతకాలు కైవసం చేసు కున్నాడు. గుడియాత్తం యూనియన్ సీవూరు గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు జయమూర్తి దక్షిణాఫ్రికాలో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 302.6 కిలోలు, 185 కిలోలు, 295.5 కిలోలు విభాగం సహా నాలుగు బంగారు పతకాలు సాధించారు. జయమూర్తి ప్రతిభకు ప్రముఖులు, సహ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## విష్ణు సహస్రనామ జపయాగం



వేలూరు, అక్టోబరు 13: విష్ణు సహస్రనామ పారాయణ మండలి, వేలూరు బ్రాహ్మణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 18వ విష్ణు సహస్రనామ పారాయణం జపయాగం సత్తువాచ్చేరిలోని సెల్వ వినాయగ ఆలయంలో జరిగింది. సుప్రభాతతో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర పూజ, సంకల్పం చేశారు. కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ మండలి అధ్యక్షుడు సత్యమూర్తి, కార్యదర్శి సుబ్రమణి, కోశాధికారి విజయరాఘవన్, గౌరవాధ్యక్షుడు సత్యమూర్తి, వేలూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాజ, జనరల్ సెక్రటరీ కృష్ణమూర్తి, న్యాయవాది వరదన్, మాజీ ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, ఉపాధ్యక్షుడు ఉమాపతి శివం, ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## సోలాపురి అమ్మవారి ఆలయంలో అన్నదానం


అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్

వేలూరు, అక్టోబరు 13: స్థానిక తోటపాళ్యం గ్రామ దేవత సోలాపురి అమ్మవారి ఆలయం లో శనివారం విశయ దశమి సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత పాల్గొని అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీనస్ నరేంద్రన్, కౌన్సిలర్ మురుగన్, డీఎంకే శాఖ సెక్రటరీ కృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఖాళీల ఆధారంగా నియామకాలు: టీఎన్‌పీఎస్సీ

పెరంబూర్, అక్టోబరు 13: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-4 పోస్టులను బట్టి నియామకాలు చేపడుతున్నట్లు టీఎన్‌పీఎస్సీ వివరణ ఇచ్చింది. ఈ ఏడాది నిర్వహించే గ్రూప్-4 పరీక్షలో భర్తీచేయనున్న పోస్టుల సంఖ్య పెంచాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, టీఎన్‌పీఎస్సీ వివరణ ఇస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. 2022లో నిర్వహించిన గ్రూప్-4 పరీక్ష ద్వారా 2020-21, 2021-22, 2022-13 సంవత్సరాల్లో 10,139 పోస్టులు భర్తీ చేశామన్నారు. ఆ ప్రకారం ఒక ఏడాది సరాసరిన 3,380 ఖాళీ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపింది. ఈ ఏడాది నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షలో 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి 8,932 ఖాళీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించామని, ఆ ప్రకారం, ఒక ఆరిక సంవత్సరానికి 4,466 ఖాళీలు భర్తీ చేశామన్నారు. ఇప్పటికే, 2024లో నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షల్లో సరాసరిన ఈ ఆర్థిక సంవత్సరానికి అదనంగా 1086 (4466-3380) ఖాళీ స్థానాలు అని మొత్తం 2172 పోస్టులు అదనంగా భర్తీ చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.




పుష్కరిణిలో చక్రత్తాళారును మునక వేయించిన అర్చకులు, టీటీడీ ఈవో, అదనపు ఈవో తదితరులు - ఆలయంలో గరుడపటాన్ని కిందకు దించుతున్న అర్చకులు

# బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

## ● శనివారం ఉదయం చక్రస్నానం.. రాత్రి ధ్వజావరోహణం

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి జరిగిన చివరి ఘట్టమైన ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల మొదటిరోజు ధ్వజారోహణం సందర్భంగా గరుడాళ్వార్ ఆహ్వానించిన దేవతలను తిరిగి పంపే కార్యక్రమాన్నే ధ్వజావరోహణం అంటారు. ఈ సందర్భంలోనే తిరిగి వచ్చే బ్రహ్మోత్సవాలకు రావాలని గరుడాళ్వార్ దేవతలను కోరతారని పురాణోక్తి. చివరి రోజైన శనివారం సాయంత్రం ఏడు గంటలకు ఉభయ దేవేరుల సమేతంగా స్వామివారిని బంగారు తిరుచ్చిలో తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభం వద్దకు వేంచేపుచేశారు. రాత్రి 9 గంటలకు అర్చకస్వాములు పూజాధికార్యక్రమాలు నిర్వహించి ధ్వజస్తంభంపై ఉన్న గరుడపటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. అనంతరం ధ్వజపడి నివేదన కావించి, ఆలయంలోని బంగారువాకిలిలో ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.

### వేడుకగా చక్రస్నానం

శనివారం ఉదయం ఆలయం నుంచి ఉత్సవర్లను తిరుచ్చిలో, చక్రత్తాళ్వార్‌ను పల్లకీలో తిరుమాడ వీధుల్లో ఊరేగింపుగా వరాహ స్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం, ఇత్యాది కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత చక్రత్తాళ్వార్‌ను అర్చకస్వాములు పుష్కరిణిలో మూడుమునకలు వేయించారు. పుష్కరిణిలో అప్పటికే వేచివున్న వేలాదిమంది భక్తులు గోవింద నామస్మరణలతో స్నానమాచరించారు. అనంతరం ఉత్సవర్లను పల్లకీలో ఆలయం ఆలయానికి వేంచేపు చేశారు. పుష్కరిణి సామర్థ్యం తక్కువగా ఉండే నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో భక్తులను విడదల వారీగా లోపలకు అనుమతించారు. దీంతో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకోలేదు. పుష్కరిణి చుట్టూ పోలీసు, భద్రతా, ఇతర బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడంతో చక్రస్నానం సాఫీగా సాగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, రవినాథ్‌తిల్హరి, నందమూరి వసుంధరదేవి, జన సేన పార్టీ నేత పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణి చుట్టూ ఉన్న భక్తులు

## సమష్టి కృషితో విజయవంతం

### అధికారులంతా కొత్తయినా.. ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సకల సౌకర్యాలతో భక్తులను వాహనసేవలను కనులారా తిలకించారు. అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో తొమ్మిదిరోజుల ఉత్సవాలు విజయవంతంగా సాగాయి. ఈనెల 4వ తేదీన మొదలైన బ్రహ్మోత్సవాల్లో సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రూ.13.45 కోట్లతో నిర్మించిన వకుళామాత సెంట్రల్ కిచెన్‌ను మరుసటి రోజు ప్రారంభించారు. ఇక, ఉత్సవాల్లో తొలి నాలుగు రోజులు భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నా.. ఐదవ రోజు గరుడ సేవకు దాదాపు ఐదేళ్ల తర్వాత విపరీత రద్దీ కనిపించింది. రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలోని అదనపు క్యూలైన్ల ప్రవేశంలో గంట పాటు భక్తుల మధ్య తోపులాటలు మినహా.. అంతా ప్రశాంతంగా ముగిసింది. జేఈవో వీరబ్రహ్మం మినహా ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్వో శ్రీధర్ బ్రహ్మోత్సవాలకు కొత్తే అయినప్పటికీ.. ముందస్తు ప్రణాళిక, సమష్టి కృషితో మంచి ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. ఈ ఏడాది కళాబృందాల ప్రదర్శనలు చాలా సాధారణంగా జరిగాయి. పెద్దగా మెప్పించలేకపోయారనే భావన వ్యక్తమైంది. దీంతో వచ్చే బ్రహ్మోత్సవాలకు ఉత్సాహవంతులు.. వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ, ప్రముఖ కళాబృందాలను తీసుకురావాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎప్పటిలానే ఈసారి కూడా విద్యుత్, పుష్పాలంకరణలు భక్తులను మెప్పించాయి. మరోవైపు ఈసారి పోలీసుల బందోబస్తు భారీగా కనిపించింది.



చక్రస్నానం సందర్భంగా పుష్కరిణిలోకి వస్తున్న భక్తులు

### కనిపించని వీఐపీల హడావుడి

ఈసారి ఉత్సవాల్లో వీఐపీల హడావుడి లేకుండా వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి. సీఎం పర్యటనలోనూ పెద్దగా రాజకీయ ప్రముఖులు కనిపించలేదు. తొమ్మిదిరోజుల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు బీవీఎల్ఎన్ చక్రవర్తి, గోపాలకృష్ణారావు, రవినాథ్ తిల్హరి, జ్యోతిర్మయి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, నందమూరి వసుంధరాదేవి మాత్రమే వాహనసేవల్లో పాల్గొన్నారు.

### ఈ'సారీ' మరుగుదొడ్ల సమస్య

ముందస్తు ప్రణాళికతో ఎన్ని ఏర్పాట్లు చేసినా.. ఈసారి కూడా మాడవీధుల్లో మరుగుదొడ్ల విషయంలో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తాయి. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, విరిగిపోయిన పైపులు, నీటి కొరత, దుర్వాసనతో గరుడసేవ రోజున భక్తులు ఇబ్బంది పడ్డారు. వీటిని గుర్తించిన అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా యోచిస్తున్నారు. గ్యాలరీల విస్తరణపైనా దృష్టిపెట్టారు.

## ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి అభినందనలు

ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కోలీవుడ్ హీరో ఉదయనిధికి నడిగర్ సంఘం సభ్యులు అభినందనలు తెలిపారు. ఆదివారం డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఉదయనిధిని నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తీ, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్, కార్యవర్గ సభ్యులు లత, రాజేష్ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిత్రపరిశ్రమ ఎదుర్కొంటున్న పలు సమస్యలతో పాటు నడిగర్ సంఘం భవన నిర్మాణ అంశం కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్టు సమాచారం.



ఉదయనిధితో నడిగర్ సంఘం సభ్యులు

చిత్రజ్యోతి

## 'విడుదలై-2' డబ్బింగ్ ప్రారంభం

జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'విడుదలై'-2' చిత్రీకరణ పూర్తి చేసుకుని, డబ్బింగ్ ప్రారంభించింది. డబ్బింగ్ కార్యక్రమాలు పూర్తి చేసి, ముందుగా ప్రకటించినట్టుగా డిసెంబరు 20న విడుదల చేయనున్నారు. ఈ చిత్రం తొలి భాగం గత యేడాది మార్చి 31న విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఫస్ట్‌పార్ట్‌లో హీరో సూరి, లీడింగ్ రోల్ పోషించిన విజయ్ సేతుపతికి సంబంధించిన పాత్రలే కీలకంగా ఉన్నాయి. రెండో భాగంగా విజయ్ సేతుపతికి సంబంధించిన సన్నివేశాలతో కిషోర్, మంజు వారియర్, కెన్ కరుణాస్ వంటి ముఖ్య నటులకు సంబంధించిన పాత్రలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రం డబ్బింగ్ పూజా కార్యక్రమంతో ప్రారంభించగా, ఇందులో దర్శకుడు వెట్రిమారన్, సూరి, విజయ్ సేతుపతి పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇదిలావుంటే, రెండో భాగం కోసం చిత్రీకరించిన రషెస్ నిడివి అధికంగా ఉండటంతో మరో భాగం (థర్డ్ పార్ట్)గా విడుదల చేయాలన్న ఆలోచనలో దర్శక నిర్మాతలున్నట్టు సమాచారం. అయితే, దీనిపై క్లారిటీ రావాల్సివుంది.




డబ్బింగ్ స్టూడియోలో వెట్రిమారన్, సూరి, విజయ్ సేతుపతి

## 'ప్రైవేట్' వీడియోపై స్పందించిన నటి ఓవియా

### 'ఎంజాయ్ బ్రో' అంటూ కామెంట్



బిగ్‌బాస్ ఫేం ఓవియా

తమిళ నటి, బిగ్‌బాస్ ఫేం ఓవియాకు సంబంధించి ప్రైవేట్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది. దీన్ని చూసిన నెటిజన్లు వివిధ రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. లీకైన క్లిప్‌నకు సంబంధించిన పూర్తి నిడివితో ఉన్న వీడియో కావాలని ఓ నెటిజన్ కోరగా, దానికి ఓవియా కూల్‌గా 'నెక్స్ట్ టైమ్ బ్రో' అంటూ సమాధానమిచ్చారు. మీకు సంబంధించిన 17 సెకన్ల వీడియో లీకైంది మేడమ్ అంటూ మరో నెటిజన్ ట్వీట్ చేయగా, "ఎంజాయ్" అంటూ రిప్లై ఇచ్చారు. దీంతో ఆ వీడియో తనకు సంబంధించిందే అని ఓవియా చెప్పేశారంటూ ఇంకో నెటిజన్స్ అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుంటే, ఈ క్లిప్ ఒరిజినల్ వీడియోనా లేక డీప్‌ఫేక్ చేసిన మార్ఫింగ్ వీడియోనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



'డ్రాగన్'లో ప్రదీప్ రంగనాథన్, అనుపమ పరమేశ్వరన్

## ప్రదీప్ 'డ్రాగన్' ఫస్ట్‌లుక్

'ఓ మై కడవులే' ఫేం అశ్వంత్ మారిముత్తు - హీరో ప్రదీప్ రంగనాథన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'డ్రాగన్' చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విజయదశమిని పురస్కరించుకుని విడుదల చేశారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై కల్పాతి ఎస్.అఘోరం, కల్పాతి ఎస్.గణేష్, కల్పాతి ఎస్.సురేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా, కేఎస్ రవికుమార్, మిష్కిన్, వీజే సిద్ధు, హర్షద్ తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. చిత్రీకరణ శరవేగంగా జరుపుకుంటుండగా, ఇప్పటివరకు ఒక్క అప్‌డేట్ కూడా ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో దసరా పండుగ సందర్భంగా ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. 'బస్సు టాప్ కూర్చొనివున్న హీరో.. పొగతాగుతూ కనిపిస్తుంటే, ఆ బస్సుపై వరస్ట్ స్టూడెంట్ అని రాశారు. అలాగే, మరో రెండు కొత్త పోస్టర్లను కూడా రిలీజ్ చేశారు. కాగా, ప్రదీప్ హీరోగా నటించి దర్శకత్వం వహించిన 'లవ్‌టుడే' బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. తమిళం, తెలుగు భాషల్లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' మూవీలో ప్రదీప్ రంగనాథన్ హీరో పాత్రకే పరిమితమయ్యారు.

## నేను పరికరాన్ని మాత్రమే.. దర్శకుడే మలిచారు

● నిఖిలా విమల్



తాను ఒక పరికరాన్ని మాత్రమేనని, దర్శకుడు తనకు నచ్చిన రీతిలో మలచుకున్నారని హీరోయిన్ నిఖిలా విమల్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఆయన స్వీయ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'వాళై'. ఇటీవల విడుదలై ఘన విజయం సాధించింది. ఇందులో పూంగొడి టీచర్ పాత్రలో ప్రేక్షకులను మెప్పించిన నిఖిలా విమల్... 'వాళై' చిత్రంలో నటించిన తన అనుభవం, పూంగొడి టీచర్ పాత్రను దర్శకుడు మలిచిన తీరు వర్ణించారు. "వాళై' సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప విషయం. ఆ పాత్రకు తగినట్టుగా దర్శకుడు నన్ను మలుచుకున్నారు. నేను ఒక పరికరాన్ని మాత్రమే. 'కర్ణన్' చిత్రంలో హీరోయిన్ రజీషా విజయన్ పాత్రకు డబ్బింగ్ చెప్పడానికి నగరానికి వచ్చాను. ఆ సమయంలోనే 'వాళై' చిత్రం గురించి దర్శకుడు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం చిత్రాన్ని నిర్మించి, అందులో నా కెరీర్‌లో నిలిచిపోయే పాత్రను ఇచ్చిన దర్శకుడికి రుణపడివుంటాను' అని పేర్కొన్నారు.

## ముగిసిన బతుకమ్మ సంబరాలు




బతుకమ్మ సంబరాల్లో నిర్వాహకులు - సందడి చేస్తున్న తెలంగాణ ఆడపడచులు

ప్యారీస్, అక్టోబరు 13: నగరంలో నివసిస్తున్న తెలంగాణ వాసులు సంప్రదాయంగా చేపట్టిన బతుకమ్మ సంబరాలు వైభవంగా ముగిశాయి. షావుకారుపేటలోని రాజస్థాన్ గ్రౌండ్‌లో చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో నగరం, శివారు ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేదిక ప్రాంగణంలో వివిధ రకాల పూలతో రూపొందించిన బతుకమ్మను ఏర్పాటు చేసి మహిళలు నృత్యాలు చేశారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన సంబరాలు సద్దుల బతుకమ్మ (గౌరమ్మ) పూజలతో ముగిశాయి. సంఘ అధ్యక్షుడు ముప్పిడి పరశురామ్, గౌరవాధ్యక్షుడు డి.అంజయ్య, కార్యదర్శి చిత్తలూరి శ్రీనివాస్, కోశాధికారి ఎస్కే సతీష్, సభ్యులు, సీహెచ్ నరసింహ, ఎన్.అశోక్, సి.అంజయ్య, శ్రీను, సీహెచ్ రామ్మూర్తి, తెలంగాణా కుల సంఘాల నాయకుడు, తెలంగాణా ఆడపడుచులు ఆటపాటలతో సందడి చేశారు.

## ఉపాధి కల్పించే స్థాయికి ఎదగండి..!

### పట్టభద్రులకు ఏఐసీటీఈ ఛైర్మన్ టీజీ సీతారామ్ హితవు ● ఘనంగా ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం



విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న టీజీ సీతారామ్, వ్యవస్థాపక ఛాన్సలర్ డా. టీఆర్ పారివేందర్

చెన్నై, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగార్హతకు డిగ్రీలు ఓ ధ్రువ పత్రం వంటివని, కొత్తగా పట్టాలు పొందే విద్యార్థులు ఉపాధి కోసం వెంపర్లాడకుండా తామే ఉపాధి కల్పించేలా ప్రతిభా పాటవాలు పెంచుకోవాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఛైర్మన్ డాక్టర్ టీజీ సీతారామ్ పిలుపునిచ్చారు. కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం శాస్త్ర, సాంకేతిక విద్యాసంస్థలో ఆదివారం జరిగిన 20వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. భారతదేశంలో అత్యధిక స్టార్టప్‌లు కలిగిన మూడో దేశంగా పేరుగడించిందని, వీటిలో 60 శాతానికి పైగా స్టార్టప్‌లు విద్యార్థి వర్గం నుండే రూపొందుతున్నాయని చెప్పారు. వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ అధ్యక్షత వహించిన ఈ స్నాతకోత్సవంలో 8438 మంది విద్యార్థులు పట్టాలు అందుకున్నారు. వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ముత్తమిళ్‌సెల్వన్ స్వాగతోపన్యాసం చేశారు. ప్రో ఛాన్సలర్లు డాక్టర్ రవి పచ్చముత్తు, డాక్టర్ పి.సత్యనారాయణన్, ఎస్ఆర్ఎం గ్రూపు విద్యా సంస్థల కో-ఛైర్మన్ ఎస్. నిరంజన్, ప్రోవైస్ ఛాన్సలర్ (ఎంహెచ్ఎస్) ఇన్‌ఛార్జి డాక్టర్ నితిన్ ఎం.నాగర్‌కర్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.పొన్నుసామి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కే గుణశేఖరన్, యూజీసీ నామినీ (ఫైనాన్స్ కమిటీ) కమాండ్ వీకే జైట్లీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కర్రసాము విన్యాసాలు



విజేతలతో డాక్టర్ వి.సునీల్, నిర్వాహకులు

ప్యారీస్, అక్టోబరు 13: దక్షిణ చెన్నై ఉత్తర పశ్చిమ జిల్లా టి.నగర్ నియోజకవర్గం, కోడంబాక్కం ఫాతిమా పాఠశాలలో 134 కర్రసాము విన్యాసాలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఏకలవ్యన్ ఆత్మరక్షణ సంస్థ నిర్వాహకుడు ఎస్.శేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కర్రసాము పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ ఈగల్ కర్రసాము శిక్షణా సంస్థకు చెందిన అయ్యాదురై, జె.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ, స్వీయరక్షణ కోసం ఆడపిల్లలు ఇలాంటి ప్రాచీన సాహస క్రీడల్లో శిక్షణ పొందాలని ఇందుకోసం వివిధ ప్రైవేటు సంస్థలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## గరుడ వాహనంపై ఊరేగిన వేంకట ముడయాన్‌స్వామి



గరుడవాహనంలో ఊరేగుతున్న స్వామివారు

ప్యారీస్, అక్టోబరు 13: స్థానిక కొడుంగైయూర్ వెంకటేశ్వర నగర్‌లోని సిద్ధి వినాయక శ్రీనివాస వేంకట ముడయాన్ ఆలయ 10వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఉదయం 8 గంటలకు అంకురార్పణం, ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రాత్రి 7.30 గంటలకు అందంగా అలంకరించిన వేంకట ముడయాన్ స్వామివారిని గరుడ వాహనంలో ఊరేగించారు. సంఘ నిర్వాహకులు ఎస్.రవిచంద్రన్, బోడి శ్రీనివాసులు, బీహెచ్ శ్రీనివాస్, కె.భావనారాయణ, ఎస్వీ భాస్కర్, ఎన్.జగన్నాధన్, గజేంద్రన్ తదితర నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అమరావతిలో ఆంధ్రప్రదేశ్ మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారాలోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న చెన్నై తెలుగు అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, టీడీపీ నేత రామారావు

## రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్యారీస్, అక్టోబరు 13: స్థానిక పార్క్ టౌన్ కలపాచారి వీధిలోని ఆయిర వైశ్య తెలుగు బేరి వైశ్య సభ ఆధ్వర్యంలో దుర్గాష్టమి సందర్భంగా అన్నాడి చెట్టి అంకమ్మ రత్నం చెట్టి సదనంలో రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేసి శరన్నవరాత్రుల ఉత్సవాలను ప్రారంభించారు. 108 మంది ముత్తయిదువలు సామూహిక కుంకుమార్చన చశారు. అధ్యక్షులు బెల్లపు రవీంద్ర, చింతు పుల్లయ్య, పొక్కాలి, బాలాజి, పోకల ఆర్ముగం, మైలాంగం బాబు, మూర్తి చెన్నకేశవులు, పంచెట్టి గిరిధర్, దైవారాధన కమిటీ ఛైర్మెన్ అనిశెట్టి గురునాదం సహా ఇతర కమిటీ నిర్వాహకులు అన్నప్రసాదాలు, పసుపు కుంకుమలు పంపిణీ చేశారు.